ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు
సోమవారం 22 సెప్టెంబరు 2025



బళ్లారి జిల్లాలో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తాం

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలు
- గనుల ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ: డీసీ నాగేంద్ర ప్రసాద్

బళ్లారి దుర్గామాతను దర్శించుకున్న 6 మంత్రి తిమ్మాపుర

- కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు
- కార్యకర్తలతో సమావేశం



సర్వం సిద్ధం

- నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా కులగణన
- తేలనున్న 7 కోట్ల మంది పూర్తి సమాచారం
- విధులకు 2 లక్షల మంది కేటాయింపు
- ఒక్కొక్కరికి 150 ఇళ్లు.. 15 రోజుల గడువు



- బెంగళూరులో ఖరారుకాని తేదీ
- కులానికి ప్రాధాన్యం ఇవ్వాలని స్వామీజీలు, కుల సంఘం నాయకుల పిలుపు

బెంగళూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం అన్ని వర్గాలకు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన సామాజిక, విద్య పరమైన కులగణన సోమవారం నుంచి ప్రారంభం కానుంది. అక్టోబరు 7వ తేదీ వరకు కులగణన ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగనుంది. వివిధ కులాల పెద్దల ఆందోళన, అభ్యంతరాలు, గందరగోళం నేపథ్యంలోనే సర్వే జరిపేందుకు బీసీ కమిషన్ సిద్ధమైంది. 2 లక్షలమంది ఉద్యోగులు కులగణన సర్వేలో భాగస్వామ్యులు కానున్నారు. ఇందులో 1.50 లక్షలమంది ఉపాధ్యాయులు ఉన్నారు. దసరా సెలవుల సమయంలోనే కులగణన జరపాలని ప్రభుత్వం నిర్ణయించేందుకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారనే ఏకైక కారణంతోనే. ప్రతి ఉపాధ్యాయుడికి 150 ఇళ్లను కేటాయించనున్నారు. 15రోజుల వ్యవధిలో ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. దీని ప్రకారం సెలవులు, ఇతరత్రా కారణాలతో సంబంధం లేకుండా ప్రతిరోజూ కనీసం 10 ఇళ్లకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని సేకరించాల్సి ఉంటుంది. వీరికి అనుబంధంగా ఆశా కార్యకర్తలు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు కులగణన సర్వేలో భాగస్వామ్యులు కానున్నారు.

అధ్యయనానికి పలు కారణాలు

విభిన్నమైన స్థలాలలో నివసించడం లేదా విభిన్న వృత్తులలో కొనసాగుతున్న వ్యక్తుల ఆర్థిక అసమానత తగ్గించేందుకు, అందరికీ సమానమైన సౌలభ్యాలు కల్పించడం, అవకాశాలలో బేధాభిప్రాయాలను తొలగించేలా రూపొందించేందుకు సామాజిక స్థితిగతులను అధ్యయనం చేయడం అనివార్యమని బీసీ కమిషన్ చైర్మన్ మధుసూదన్ నాయక అభిప్రాయపడుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతోపాటు రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంబంధించిన సమగ్ర వివరాలను సేకరించనున్నారు. కులాలలో సామాజిక, విద్య, ఆర్థిక స్థితిగతులను విశ్లేషించి బీసీ కులాల జాబితాను సిద్ధం చేసి ఏ కులంలో ఎంతమంది ఉన్నారు, వారి జీవన విధానంపైనా సమగ్రంగా వివరాలు సేకరించదలిచారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి

సర్వేకు వెళ్లేవారు కమిషన్ ఇచ్చిన గుర్తింపు కార్డును చూపాల్సి ఉంటుంది. ప్రశ్నలు అడిగే సమయంలో ఆత్రుత పాటించరాదు. సౌజన్యంగా మాట్లాడాలని, సంయమనం పాటించి సమగ్ర వివరాలను తెలుసుకోవాల్సి ఉంటుంది. సర్వేకు సంబంధించి ప్రతి ప్రశ్నకు వివరణాత్మక వివరాలు నమోదు చేయడంతోపాటు అవసరమైన వివరాలు, వారి నుంచి ఆధారాలు తెలుసుకునేందుకు ఓర్పుగా ఉండాలని శిక్షణ ద్వారా సూచించారు. సర్వే సమయంలో ఏ ఇంటినీ వదిలిపెట్టరాదనే కారణంతో, విద్యుత్ సరఫరాల కంపెనీల సహకారంతో విద్యుత్ మీటర్ల ఆధారంగా ఇళ్ల జాబితాను సిద్ధం చేశారు. 2 కోట్ల ఇళ్లకు జీపీఎస్ కేప్టర్‌ను అమలు చేశారు. ఒక ఉద్యోగికి 150 ఇళ్లను కేటాయిస్తూ ప్రతి ఇంటి జియోట్యాగ్‌ను చేసి గణాంకాలకు మార్గదర్శకం చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలిగించరాదు.

సర్వే చేపట్టాల్సింది ఇలా..

రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా జరిగే కులగణనకు సర్వం సిద్ధమైంది. విద్యుత్ కంపెనీల ప్రతినిధులు ఇంటింటికీ అతికించిన స్టిక్కర్‌లో నమోదు చేసిన సంఖ్యకు అనుగుణంగా జియో కో-ఆర్డినేట్ ద్వారా వివరాలు సేకరించదలిచారు. మొబైల్ అప్లికేషన్‌లో రేషన్‌కార్డు సంఖ్య నమోదు చేయగానే కుటుంబానికి సంబంధించిన సమాచారం ఆటోపాపులేట్ కానుంది. తద్వారా సమీక్ష జరిపే ప్రక్రియ కొంత సులువు కానుంది. దరఖాస్తులో కాలం సంఖ్య 1-40 వరకు కుటుంబానికి సంబంధించిన ప్రతి సభ్యుడి సమాచారం ఉంటుంది. 41 నుంచి 60 వరకు కుటుంబానికి సంబంధించిన సమాచారం నమోదు చేస్తారు. కులం - ఉపకులాలతోపాటు పర్యాయపదాలు ఉంటే చెబితే మాత్రమే నమోదు చేస్తారు. హాస్టల్, హోటల్, పేయింగ్ గెస్ట్‌లతోపాటు ఇతర ప్రాంతాలలో తాత్కాలికంగా నివసించేవారి వివరాలను నమోదు చేయరు. వారి తల్లిదండ్రులనుంచి సేకరించిన ఆధారాలతోనే కొనసాగిస్తారు. సమాచారం ఇచ్చే కుటుంబ పెద్ద ఫోటో సేకరిస్తారు. ఒకవేళ ఫొటోకు అంగీకరించని పక్షంలో బీపీఎల్ కార్డు లేదా ఆధార్, కులధ్రువీకరణపత్రంతోనే సర్వే చేస్తారు. కుటుంబ పెద్ద మొబైల్ నెంబరు తీసుకుంటారు. నిరాకరిస్తే ఓ పత్రంలో సంతకం తీసుకుంటారు. కులాంతర వివాహం చేసుకున్నవారికి సంబంధించిన వివరాలు, కుటుంబ పెద్దతోపాటు భార్య, పిల్లలకు కులం నమోదు చేసే విషయంలో తండ్రి కులాన్ని పిల్లలకు నమోదు చేస్తారు. తల్లికి చెందిన కులాన్ని నమోదు చేసేందుకు అవకాశం లేదు.



ఆఫ్‌లైన్‌లోనూ నమోదు చేసే అవకాశం

నెట్‌వర్క్‌లేని ప్రాంతంలో ఆఫ్‌లైన్ విధానంలో వివరాల నమోదుకు అవకాశం ఉంది. ఇటీవల పెళ్లి అయిన వారి వివరాలు, భర్త ఇంటికి సంబంధించి నమోదు చేస్తారు. కులానికి సంబంధించిన ఆధార పత్రాలను తప్పనిసరిగా తీసుకోవాలనే నిబంధన లేదు. ఎస్సీలకు సంబంధించి 101 కులాల జాబితాలో ఉంటే మాత్రమే నమోదు చేస్తారు. ఒక ఇంట్లో ఒకటికంటే ఎక్కువ రేషన్‌కార్డులు ఉంటే ప్రత్యేక కుటుంబాలుగా పరిగణించి నమోదు చేస్తారు. రాష్ట్రంలో రిజిస్టర్ అయిన ఆధార్ వివరాలు మాత్రమే ఉపయోగించేందుకు వీలు ఉంటుంది. వివరాలు నమోదు చేశాక మరో సారి సవరణలు చేసేందుకు వీలుంటుంది. ఆ తర్వాత అవకాశం ఉంటుంది.

గ్రేటర్‌లో..

గ్రేటర్ బెంగళూరు ప్రాధికార పరిధిలో కులగణన సర్వే సోమవారం నుంచి కొనసాగదు. మూడు నాలుగురోజుల తర్వాత ప్రారంభించనున్నట్టు బీసీ కమిషన్ చైర్మన్ ప్రకటించారు. సమగ్ర వివరాలను ప్రతి కుటుంబం నుంచి సేకరించాలనేది ఆశయంగా పెట్టుకున్నారు.



మీడియాతో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ మధుసూదన్

కులానికి ప్రాధాన్యం ఇవ్వండి..

కులగణన నమోదు విషయంలో కులసంఘాల పెద్దలు, స్వామిజీలు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కులాల వివరాలను సమగ్రంగా నమోదు చేయించాలని సభలు, సమావేశాలు, పత్రికా ప్రకటనలు, కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. 46 కులాలకు ముందు క్రిస్టియన్ పదాన్ని బీసీ కమిషన్ తొలగించింది. రెడ్డి సామాజికవర్గానికి చెందినవారు ఇదే పేరు నమోదు చేయాలని, మతం - హిందువుగా ఉండాలని సూచిస్తున్నారు. ఇక తెలుగువారు నమోదులో మాతృభాష తెలుగుగా నమోదు చేయాలని అవగాహన కల్పిస్తున్నారు. ఎస్సీ సామాజికవర్గంలోని ఉపకులాలు నేరుగా మాదిగ అని నమోదు చేయాలని సూచిస్తున్నారు. ప్రతి కులసంఘం ప్రాధాన్యం కల్పించేందుకు సిద్ధమైంది.

- మరోవైపు సర్వేను తాత్కాలికంగా కొన్నిరోజులు వాయిదా వేయాలని ఒక్కలిగ సామాజికవర్గం కోరుతోంది. ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథస్వామిజీ అధ్యక్షతన జరిగిన సభలో ఇదే ప్రస్తావన తీసుకొచ్చారు. మరోవైపు కులగణన ప్రక్రియకు సోమవారం హైకోర్టులో జరిగే విచారణ ఎటువంటి తీర్పు వస్తుందో అదే చివరి అవకాశం కానుంది.

పీఠాధిపతి

తొలగింపు

- లింగాయత ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడారన్న ఆరోపణలపై ట్రస్టు నిర్ణయం



జయమృత్యుంజయ స్వామీజీ

బెంగళూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంచమసాలి పీఠాధిపతి స్థానం నుంచి జయమృత్యుంజయస్వామిజీని తొలగించారు. అఖిలభారత లింగాయత పంచమసాలి సమాజ ట్రస్టు ఈమేరకు నిర్ణయం తీసుకుంది. ఆదివారం ట్రస్టు ప్రధాన కార్యదర్శి నీలకంఠ అసోటి మీడియాతో మాట్లాడారు. పంచమసాలి సముదాయం నుంచి ప్రథమ జగద్గురు బసవ మృత్యుంజయస్వామిజీని తొలగించామన్నారు. లింగాయత ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడడం, అక్రమ ఆస్తులతోపాటు ఆరోపణలు వచ్చిన మేరకు స్వామిజీని తొలగించామన్నారు. ఇప్పటికే నోటీసు జారీ చేశామని, స్పందన లేకపోవడంతో పీఠాధ్యక్ష పదవినుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నామన్నారు.

సర్వే పేరుతో కులాల మధ్య చిచ్చు

- సీఎంపై గాలి జనార్దన్ రెడ్డి ధ్వజం 6

రారండోయ్ రాచనగరికి..!

- దసరా శరన్నవరాత్రులకు సర్వం సిద్ధం
- ముస్తాబైన చాముండి కొండలు
- నేడు మైసూరుకు సీఎం, డీసీఎం, అతిథులు
- ఉత్సవాలను ప్రారంభించనున్న బుకర్ ప్రైజ్ విజేత బానుముస్తాక్



నాడదేవత చాముండీదేవి ఉత్సవమూర్తి

బెంగళూరు, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా దసరా శరన్నవరాత్రులకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ప్రతిష్ఠాత్మకమైన మైసూరు దసరా ఉత్సవాల ప్రారంభానికి సర్వం సిద్ధం అయ్యింది. ఆదివారం మధ్యాహ్నం నుంచే అతిథుల రాకతో మైసూరుకు కొత్త శోభ వచ్చింది. మైసూరు నగర వీధులు విద్యుద్దీపాలతో జిగేల్‌మంటోంది. పలు కూడళ్లు, రాజుల ప్యాలెస్‌లు ధగేల్ మనిపిస్తున్నాయి. మైసూరులో సోమవారం దసరా ఉత్సవాలను బుకర్ ప్రైజ్ విజేత బానుముస్తాక్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, దేవదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి, మైసూరు జిల్లా ఇన్‌చార్జ్‌మంత్రి మహదేవప్ప, కన్నడ సంస్కృతిశాఖ మంత్రి శివరాజ్ తంగడగిలు పాల్గొననున్నారు. చాముండి కొండలపైకి సోమవారం ఉదయం అతిథులంతా చేరుకుంటారు. చాముండేశ్వరి ఆలయం పక్కనే వెండి రథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూలు చల్లడం ద్వారా ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. ఆలయం పక్కనే ఏర్పాటు చేసిన ప్రత్యేక సభావేదిక నుంచి సీఎంతోపాటు ప్రముఖులు ప్రసంగిస్తారు. మైసూరుకు దసరా శోభ వచ్చింది.



చాముండి కొండ వద్ద భక్తులకు ఏర్పాట్లు



బందోబస్తు ఏర్పాట్లలో పోలీసు అధికారులు



మైసూరు ప్యాలెస్ వద్ద ఏర్పాట్లు

చెరువులకు జలకళ



మరువ పారుతున్న సోమేశ్వర చెరువు

ముళబాగిలు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తాలూకాలో గతవారం కురిసిన వర్షాలతో చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. భూగర్భజలాలు క్రమేపీ పెరుగుతుండడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పశుపక్ష్యాదులకు నీటి కొరత తీరనుంది. పట్టణంలో ప్రముఖమైన సోమేశ్వర చెరువు రెండు రోజులుగా మరవ పారుతోంది. రాగి, అనప, అలసంద, వేరుశెనగ, సామలు, ఉలవలు తదితర రకాల పంటలు, కూరగాయల సాగుకు అనుకూలం కానుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అక్టోబరు చివరివరకు అప్పుడప్పుడు వర్షం కురిసే అవకాశం ఉందని వ్యవసాయశాఖ సహాయక డైరెక్టర్ రవి కుమార్ తెలిపారు. ఈ గ్రామాల్లో సైతం జల బాగా పెరిగిందన్నారు.



రన్‌లో పాల్గొన్న యువతీయువకులు

ఉత్సాహంగా విప్రో రన్

బెంగళూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విప్రో సంస్థ వార్షిక రన్‌లో భాగంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. సుమారు 14వేలమంది రన్‌లో పరుగులుదీశారు. విప్రో ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ రషీద్ ప్రేమ్‌జీ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివల్లి పాల్గొన్నారు. కంఠీరవ స్టేడియంలో ప్రారంభమైన విప్రో రన్ తిరిగి అక్కడే ముగిసింది.



రన్‌కు పచ్చజెండా ఊపుతున్న ప్రతినిధులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	11.430	10,742
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	11,276	10,142
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.77

సర్వే పేరుతో కులాల మధ్య చిచ్చు: గాలి

బళ్లారిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సర్వే పేరుతో ముఖ్యమంత్రి సిద్దరామయ్య కులాల మధ్య చిచ్చుపెట్టే కుతంత్రాలు చేస్తున్నారని బీజేపీ నాయకులు, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం నగరంలోని వాజ్‌పేయి లేఔట్ బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడారు. సర్వే సమర్థవంతంగా నిర్వహించి, అందరికీ సామాజిక న్యాయం చేస్తే పూర్తిగా మద్దతు ఇస్తామని, అయితే కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మిషనరీల ఒత్తిడితో పలు మతాల వెనక వారి పేరు పెడుతోందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం సర్వేకు సంబంధించిన 1400 జాతులను పట్టికను వెల్లడించిందని అయితే ఈ పట్టికలో అనకృత క్రైస్తవ జాతులను చేర్పించిందన్నారు. నేటి ప్రభుత్వం వెనుకబడిన వర్గాల కమిషన్ ద్వారా క్రిస్టియన్ లింగాయత్, క్రిస్టియన్ వక్కలిగ, బ్రాహ్మణ, మడివాళ, నైకార వంటి 48 మంది అనధికృత క్రైస్తవ జాతులు ఉన్నట్లు వెలువడటంతో దీనిపై రాష్ట్రంలో వివిధ వర్గాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయన్నారు. వీటిని అధీకృతంగా మాధ్యమాల ద్వారా ప్రకటించాలని, సమాజంలో వివిధ జాతుల్లో చిచ్చులు పెట్టే ధోరణి ముఖ్యమంత్రి మానుకోవాలన్నారు. ఈ నెల 22 నుంచి చేపడుతున్న దోషపూరిత జాతుల పట్టికను సరిచేయాలన్నారు. 12వ శతాబ్దాల్లో బసవన్న మానవ కులమత ఒకటి కావాలని కనకదాసులు కూడా కులాలని కొట్లాడుకోరాదని వారు వచనాల్లో చెప్పారని అయితే కాంగ్రెస్ ఇటీవల బసవన్న సాంస్కృతిక నాయకుడు గాను, కార్యక్రమాలను చేపడుతూ వారి సిద్ధాంతాలకు వ్యతిరేకంగా నడుచుకుంటుందని దుయ్యబట్టారు. హిందూ సమాజాన్ని విడదీసి క్రైస్తవ జాతిని బలపరిచేందుకే ఈ సమీక్షలు జరుగుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో తాను మంత్రిగా ఉన్నప్పుడు విమానశ్రయ నిర్మాణానికై నాలుగుచోట్ల స్థలాలను గుర్తించిన మిగిలిన మూడుచోట్ల అనుకూలంగా ఉన్నందున చివరకు చాగనూరు వద్ద అంతర్జాతీయ విమాన నిర్మాణానికి ఆనాడు విమానాశ్రయం నిర్మించడం మంచిదని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మోకా అనిల్‌కుమార్ నాయుడు, బీజేపీ ప్రముఖులు కేఎస్ దివాకర్ బీజేపీ నగర అధ్యక్షుడు గుర్రం వెంకటరమణ, కేపీ రామలింగప్ప, గురులింగన్న గౌడ, రామచంద్రప్ప పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి

జిల్లాలో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తాం

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలు
- గనుల ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ: డీసీ నాగేంద్ర ప్రసాద్



బళ్లారి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటికే జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు మరిన్ని పనులు గుర్తించి వేగవంతంగా పూర్తి చేస్తామని, బిమ్స్ ఆసుపత్రిలో రోగులకు అవసరం అయిన వైద్య పరికరాలు, వైద్యం అందేలా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తామని జిల్లాధికారి నాగేంద్ర ప్రసాద్ అన్నారు. ఆదివారం ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడిన ఆయన జిల్లాలో రైతులు ఇబ్బంది పడకుండా వారికి అవసరం అయిన ఎరువులు, మందులు, అలాగే పంటలు అమ్ముకునేందుకు మార్కెట్ సదుపాయం కల్పిస్తామన్నారు. బళ్లారి ప్రతిష్ఠాత్మకమైనదని, ఇక్కడ వచ్చే ముందు అన్ని అధ్యయనం చేసి వచ్చానన్నారు. ఇక్కడ ప్రజలు సౌమ్యులు అని, ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న ప్రతిఒక్కరితో చర్చించి సమస్యలు పరిష్కరించేలా చూస్తానన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి అవసరాలు, పారిశుధ్యం పనులు ఇలాంటి పనులు నగర పాలికె చూసుకుంటుందన్నారు. ఆపనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వారితో పనులు చేయిస్తానన్నారు. బళ్లారి జిల్లాలో యువతకు ఉద్యోగ అవసరాలు తీరాలంటే మరిన్ని పరిశ్రమలు అవసరం అన్నారు. ఎక్కడైనా .. ఏ ప్రాంతం అయినా అభివృద్ధి జరగాలంటే పరిశ్రమలు, నీటి వనరులు, విద్య, చాలా ముఖ్యం ఇందుకు అవసరం అయిన అన్ని సౌకర్యాలు ఇక్కడ ఉన్నాయన్నారు. ఇంకా అవసరం అయిన పరిశ్రమలు స్థాపనకు అనుమతులు ఇస్తామన్నారు. జిల్లాలో కేఎంఎఫ్, డీఎంఎఫ్, కేఎంఈఆర్‌సీ, గ్రాంటులతో పాటు ఇతర గ్రాంట్లును కూడా తెచ్చి జిల్లాను అభివృద్ధి చేస్తామన్నారు. గనిబాధిత ప్రాంతాల్లో వాతావరణం కాలుష్యం కారణంగా ప్రజలు అనారోగ్యం కాకుండా ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసకుంటామన్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



మాట్లాడుతున్న పాలక మండలి అధ్యక్షుడు మీనళ్లి తాయణ్ణ

బళ్లారి సిటీ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని పటేల్ నగరం చిన్న దుర్గమ్మ దేవస్థానం శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధం అయ్యింది. 10వ సంవత్సర దసరా శరన్నవరాత్రులు వైభవంగా ఉత్సవాలను జరుపుకుంటున్నట్లు దేవస్థానం పాలక మండలి అధ్యక్షుడు మీనళ్లి తాయణ్ణ తెలిపారు. ఆదివారం దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయను మాట్లాడుతూ సెప్టెంబరు 22నుండి అక్టోబర్ 2వ తేది వరకు దసరా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పత్రిరోజు దేవికి ప్రత్యేక అభిషేకం, మంగళ హారతి. వివిధ అలంకారాలతో దర్శనం ఇస్తారన్నారు. నేడు 22న బాల త్రిపుర సుందరి అలంకారంతో దేవి భక్తులకు దర్శనం ఇస్తారు. 23న కాత్యాయని దేవి, అలంకారం, నవగ్రహ హోమం జరుగుతుంది. సెప్టెంబరు 24న లలితాదేవి అలంకారం , మృత్యుజయరుద్ర హోమం, 25న అన్నపూర్ణేశ్వరి దేవి అలంకారం, 26న మహాలక్ష్మీదేవి, 27నవెంకటేశ్వర స్వామి అలంకారం, 28 సరస్వతి దేవి అలంకారం, 29న వరహాదేవి అలంకారం, 30న దుర్గాదేవి అలంకారం, 1అక్టోబరు న మహిషాసుర మర్దిని , 2న నిజరూప అలంకారం ఉంటుందన్నారు. ప్రతిరోజు సాయంకాలం విశేష పంచామృత అభిషేకం ఉంటుంది. సాయంకాలం నృత్య సంగీత ఉంటాయన్నారు. సమావేశంలో దేవస్థానం ఆర్చకుడు సంతోష్‌స్వామి ఆడలిత మండలి సభ్యులు రాదమ్మ, హనుమంతప్ప, కిట్టి, తదితర సభ్యులు పాల్గొన్నారు.

ఓం నమో కాలభైరవేశ్వర

- ఆదివారం అమావాస్య సందర్భంగా ఆలయంలో విశేషపూజలు
- రాష్ట్రవ్యాప్తంగా తరలి వచ్చిన భక్తులు

బళ్లారి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మల్కాల్మూరు తాలూక హనగల్లు సమీపంలోని మేఘనహట్టి వద్ద ప్రాచీన కాలం నుండి వెలసిన నుంకేమలే సిద్దేశ్వర కాలభైరవేశ్వరుడు ఆలయంలో భక్తులు పోటెత్తారు. కాలభైరవేశ్వరుడు పూజా దినం అయిన ఆదివారం ఆమావాస్య కావడంతో అనేక ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి భైరవేశ్వరుడి దర్శనం చేసుకున్నారు. స్వామికి ఉదయం పవిత్రగంగను తెచ్చి శుద్దిచేశారు. అనంతరం వివిద పూలతో పూజలు చేశారు. వెండి ఆభరణాలతో అలంకరించారు. ఉగ్ర రూపంలో భక్తులకు కాలభైరవేశ్వరుడు దర్శనం ఇచ్చారు. బళ్లారి, చిత్రదుర్గం, చెల్లకెర, హొస్పేట్ ప్రాంతాల భక్తులతో పాటు ఆంధ్రలోని అనేక ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు వచ్చి కాలభైరవేశ్వరుడిని దర్శంచుకున్నారు. కొందరు భైరవ(కుక్కలు)తో వచ్చి మొక్కును తీర్చుకోవడం విశేషం



కాలభైరవేశ్వరుడు

అవయవదానానికి అంగీకారం

బళ్లారి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జీవితం చాలించినా వారి కళ్ల నుంచి చూపు వేరే వారికి వెలుగు ఇవ్వాలని భావించారు ఈ దంపతులు, అందుకు వారి కళ్లను దానం చేయడానికి అంగీకరిస్తూ ఒప్పందం అందజేశారు. బళ్లారిలోని ప్రభుత్వ కళాశాల విశ్రాంతి ప్రిన్స్‌పాల్ జీ.ఆర్ వెంకటేశులు, ఆయన భార్య ప్రవీళ, బళ్లారిలోని విమ్స్ కంటి ఆసుపత్రిలో కళ్లు దానం చేయడానికి అంగీకరిస్తూ కళ్లతో పాటు అవయవదానానికి అంగీకరిస్తూ సంతకం చేశారు. బిమ్స్ ఆసుపత్రిలో కళ్లు మాత్రమే దానం చేయడానికి ఒప్పందం ఇచ్చారు. ఈసందర్భంగా దంపతులు మాట్లాడుతూ మానవ శరీరం ఆత్మనుంచి దూరం అయినా అవయవాలు ఇతరులకు ఉపయోగ పడాలనేదే తమ ఉద్దేశమన్నారు.



అంగీకార పత్రం అందజేస్తున్న వెంకటేశులు దంపతులు



కనకదుర్గమ్మ ఆలయంలో మంత్రి తిమ్మపుర కుటుంబ సభ్యులు

బళ్లారి దుర్గామాతను దర్శించుకున్న మంత్రి

బళ్లారి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి తిమ్మపుర కుటుంబ సభ్యులతో సహ బళ్లారి దుర్గామాతను ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం దేవాలయం ఆవరణంలో రాష్ట్ర మాద్యమ కో-ఆర్డినేటర్ వెంకటేశ్ హెగ్డే, ఇతర కాంగ్రెస్ నాయకులు, ఆయన్ను ఘనంగా సన్మానించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో కొద్దిసేపు చర్చించారు.



న్యాయాధికారి రాజేశ్ హొసమనెను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

విద్యార్థులు చదువుపై దృష్టిపెట్టాలి

- సీనియర్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె

బళ్లారి సిటీ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ విద్యార్థి దశలో సమయాన్ని చదువుకు ఉపయోగించాలని సీనియర్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె సూచించారు. ఇండోఅమెరికన్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువులను గౌరవించాలని, తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయరాదన్నారు. తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తారని, వారిని బాధత పెట్టడం తగదన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా ఎస్‌బీఐ అధికారి గుల్జార్ బేగం, కళాశాల ఛైర్మన్ నాయుడు, ప్రిన్సిపాల్ షేక్ సలీం భాషా, డిప్యూటీ ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్. హెచ్‌ఓడీ రాజేశ్,రాజా, ఉదయ్‌భాస్కర్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థినులు

ముఖ్యమంత్రి చిత్రపటంతో ఇంటి తలుపులు



ఇంటి ముందు దంపతులు

కంప్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా కూడ్లిగి తాలుకాలోని కెంచమల్లనహళ్లి గ్రామానికి చెందిన తిప్పేస్వామి పార్వతి దంపతులు తమ ఇంటి తలుపుపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య చిత్రపటాన్ని చెక్కిన తలుపులు ఏర్పాటు చేసుకుని అభిమానాన్ని చాటుకుంటున్నారు. గృహలక్ష్మీ పథకం కింద పార్వతమ్మకు రూ.30వేలు రావడంతో ఆ డబ్బులు వృథా చేయకుండా ముఖ్యమంత్రికి గుర్తుగా వారింటి తలుపులపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య చిత్రాలతో తలుపులు ఇంటికి వేసుకున్నారు. ఈ సందర్భంగా పార్వతి తిప్పేస్వామి మాట్లాడుతూ ఇళ్లలో ఎన్నో చిత్రాలు వేసుకుని వాటిని తిలకిస్తూ జీవనం కొనసాగిస్తారు. కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి మహిళలను గుర్తుంచుకొని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నేర్చుకుంటూ ప్రభుత్వ పరిపాలన పథకాలతో కొనసాగిస్తున్నారు. అలాంటి మహనీయుడు భావచిత్రపటం ప్రతి ఇంటి తలుపుల పై వేసుకుంటే తప్పేం లేదని పేర్కొన్నారు. తమ ఇంటిలో దేవుళ్ల చిత్రపటాలతో పాటు ముఖ్యమంత్రి చిత్రపటానికి పూజలు చేస్తున్నామన్నారు.

కుల గణనలో నాయక్‌గా నమోదు చేయాలి

- వాల్మీకి సంఘం నాయకుల పిలుపు



మాట్లాడుతున్న సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జయరాం

బళ్లారి సిటీ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న కుల గణనలో వాల్మీకి సమాజం వారు మత కాలమ్‌లో (కులకాలంలో)నాయక్ అని రాయాలని తద్వారా సమాజ పురోగతికి దోహదపడాలని బళ్లారి జిల్లా వాల్మీకి నాయక్ విద్యా అభివృద్ధి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.జయరాం కోరారు. ఆదివారం నగరంలోని వాల్మీకి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజనహళ్ళిలో తమ కులగురువుల సూచన మేరకు మా వాల్మీకి నాయక సమాజం యొక్క ఆర్థిక, విద్యా అభివృద్ధికి సహాయపడటానికి జనాభా లెక్కల్లో కులాన్ని నాయక అని వ్రాయాలని ఆయన సమాజ ప్రజలకు చెప్పారు. వాల్మీకి సామాజిక వార్గానికి చెందిన సంస్థలు ఎన్ని ఉన్నా అవన్నీ మా అనుబంధ సంఘాలేనని మా సంస్థ మాతృ సంస్థ లాంటిందన్నారు. సమాజానికి ఏదైనా అన్యాయం జరిగితే అందరూ కలిసి వచ్చి కలిసి పోరాడాలన్నారు. సమావేశంలో సంఘం గౌరవ కోశాధికారి కంపిళ్లరాయ, గిరిజన ఉన్నత పాఠశాల ప్రధాన కార్యదర్శి గౌరయ్య, సంఘం సీనియర్ నాయకులు బి.రుద్రప్ప, సంఘం సీనియర్ నాయకులు రుద్రప్ప, పరమదేవనహళ్ళి గోపాల్,గుజ్జల గాదిలింగప్ప,బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్



క్రీడాకారులను అభినందిస్తున్న మేయర్ సత్య

జిల్లాస్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులు

హోసూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ముఖ్యమంత్రి కప్ పోటీల్లో హోసూరు ప్రాంత క్రీడాకారులు రాణించారు. బాలికల వ్యక్తిగత విభాగంలో ఏఎస్ కనిహ ప్రథమస్థానంలో నిలవగా చార్వి, జయశ్రీ ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. బాలికల డబుల్స్ విభాగంలో కనిహ, జయశ్రీ పతకాలు సాధించారు. బాలుర వ్యక్తిగత విభాగంలో ఆదిత్య మొదటిస్థానంలో నిలిచారు. జిష్ణుశంకర్ రెండోస్థానం దక్కించుకున్నారు. బాలుర డబుల్స్ విభాగంలో ఆదిత్య, శిరీష్‌లు సత్తా చాటుకున్నారు. రాజ్ అరవిందన్, అళగర్‌లు పారా టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ విజేతలైన అథ్లెట్‌లను హోసూరు మేయర్ సత్య ఆదివారం స్వయంగా అభినందించారు. తదుపరి పోటీలలో కూడా సత్తా చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హోసూరు నార్త్ యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి, కౌన్సిలర్ నాగరాజ్, తాగ్యరాజు తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో ఆసుపత్రి ప్రహరీ

హోసూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): హోసూరు - డెంకణీకోట్టై రోడ్డులో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ప్రహరీగోడ దుస్థితికి చేరింది. డెంకణీకోట్టై, కెలమంగలం, అంచెట్టి, తళి, బాగలూరు ఇతర ప్రాంతాలనుంచి ప్రజలు, చుట్టుపక్కల ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులు 500మందికిపైగా ఆసుపత్రికి వస్తుంటారు. ఆసుపత్రి ప్రహరీగోడ సుమారు 40 మీటర్ల దెబ్బతింది. ఆసుపత్రికి వచ్చేవారు ప్రహరీగోడ సమీపాన వాహనాలు పార్కింగ్ చేస్తారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకముందే దెబ్బతిన్న గోడను తొలగించి నూతన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



దెబ్బతిన్న గోడ

కార్మికులకు న్యాయం చేయాలి

- సమాజంలో అసమానతలు తొలగాలి: ఎస్‌యూసీఐ నాయకుడు రాధాకృష్ణ



మాట్లాడుతున్న ఎస్‌యూసీఐ పొలిట్‌బ్యూరో సభ్యుడు రాధాకృష్ణ

బళ్లారి సిటీ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సమాజంలో పెట్టుబడిదారీ వ్యవస్థ, పాలకవర్గం మాత్రమే హక్కులు, ఆస్తులు అనుభవిస్తున్నారని, కార్మికులకు సైతం అన్ని హక్కులు అందాలని, సమాజంలో అసమానతలు తొలగాలని ఎస్‌యూసీఐ(కమ్యునిస్ట్)పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కే. రాధాకృష్ణ అన్నారు. విద్య-సంస్కృతిని కాపాడాలనే నినాదంతో ఆదివారం నగరంలోని బలిజ భవన్‌లో ఏఐడీఎస్‌ఓ కర్ణాటక రాష్ట్ర కమిటీ నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యకర్తల అధ్యయన శిబిరంలో ఆయన మాట్లాడారు. దోపిడీ పెట్టుబడిదారీ వ్యవస్థలో కులం, మతం, కులం వంటి విభజనలు ప్రజల్లో విభజనను సృష్టించాయన్నారు. ఆకలి పేదరికం, నిరుద్యోగం, విద్యను వాణిజ్యీకరించడం వంటి సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలు కేవలం మతం, కులానికి పరిమితం కారాదన్నారు. అన్ని కులాలు మతాలకు చెందిన పేదలు ఈ సమస్యలతో బాధపడుతున్నారన్నారు. తమ అధికారాన్ని ఏకీకృతం చేసుకోవడానికి ప్రజలను విభజించి పాలించడం పెట్టుబడిదారుల కుతంత్రమని, కాబట్టి ఈ దోపిడీ వ్యవస్థ అంతమై విప్లవం ద్వారా సోషలిజం స్థాపించబడినప్పుడే అసమానత అంతమవుతుందన్నారు. అన్నిసమస్యలకు ఇదే పరిష్కారమన్నారు. సమాజాన్ని మార్చడానికి జ్ఞానం మన ఆయుధం. జ్ఞానం లేకుండా మన చీకటిలో మాత్రమే నడుస్తామన్నారు. ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్, భగత్‌సింగ్ ,నేతాజీ సుభాస్ చంద్రబోస్, బుద్ధుడు మొదలైన వారు ఈ జ్ఞానం కోసం పాఠ్యపుస్తకాలపై మాత్రమే ఆధారపడలేదన్నారు. నేటి విద్యార్థి యువత తమ స్వార్థపూరిత ఆలోచనను విడిచిపెట్టి తమ కుటంబం మాత్రమే కాకుండా మొత్తం సమాజంలోని బాధపడుతున్న తల్లిదండ్రులందరి కన్నీళ్ళను తుడిచే విప్లవాత్మక పోరాటానికి బాధ్యత వహించాలని ఏఐడీఎస్ఓ చోద శక్తి అయిన విప్లవాత్మక పోరాట యోధుడు కార్మిక వర్గానికి గొప్ప నాయకుడు శివదాస్ ఘోస్ అన్నారన్నారు. ఈవిషయంలో చర్యలు తీసుకోవడం ద్వారా సోషలిస్ట్ విప్లవాన్ని అమలు చేసే బాధ్యతను స్వీకరించాలని పిలుపునిచ్చారు. సమావేశానికి రాష్ట్ర సచివాలయ సభ్యుడు కళ్యాణ్ కమార్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా రాష్ట్రఅధ్యక్షురాలు అశ్విని, రాష్ట్ర కార్యదర్శి అజయ్ కామత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అభయ్ దివాకర్, హనుమంతు, చంద్రకళ, మహంతేశ్ తదితరులున్నారు.

ఘనంగా అమావాస్య పూజలు.. నవరాత్రులకు సిద్ధమైన ఆలయాలు



కనక దుర్గమ్మ ఆలయంలో కమిటీ అధ్యక్షుడు మీనళ్లి తాయణ్ణ

బళ్లారిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలోని పటేల్ నగర్ చిన్న దుర్గమ్మ దేవస్థానం ఆవరణంలో అమావాస్య సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో నగరంలో భక్తాదులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించు కున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మీనళ్లి తాయణ్ణ తెలిపారు. అమావాస్య సందర్భంగా నగరంలో భక్తాదులు పెద్దఎత్తున పాల్గొని కుమారస్వామిని దర్శించుకున్నారు. రూరల్ పరిధిలో గల ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో చేళగుర్కికి యర్రితాత ఆలయంలో యర్రితాతకు అమావాస్య సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు.

ముస్తాబైన ఆలయాలు

కంప్లి (ఆంధ్రజ్యోతి): నవరాత్రుల సందర్భంగా అమ్మవారు ఆలయాలు ముస్తాబు చేపట్టారు. నవరాత్రుల్లో తొమ్మిదిరోజుల పాటు మహిళలు ప్రత్యేక శ్రద్ధలతో పూజలు చేపట్టి అమ్మవారికి మొక్కలు సమర్పించుకుంటారు. ప్రతినిత్యం తెల్లవారుజామున చుట్టుపక్కల వుండే జమ్మి చెట్టుకు వెళ్లి మహిళలు పూజలు చేపట్టి మొక్కలు సమర్పించు కుంటారు. కంప్లి, షుగర్, ఫ్యాక్టరీలోనే కాళికాదేవి ఆలయం ముస్తాబు చేపట్టారు. అలాగే ఆదివారం అమావాస్య సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి పూజలు చేపట్టారు. అలాగే బాగేవడి బసవన్న కూడా ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే బాగేవడి బసవన్న కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కురుగోడు దొడ్డ బసవేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏ ఆలయంలో చూసిన భక్తుల రద్దీ వుండిపోయాయి. పలు ఆలయాల్లో ఆలయాలకు వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలు కల్పించారు.



పూజలకు సిద్ధమైన ఆలయం



ముస్తాబైన కాళికామాత



ఎర్రితాత




బసవేశ్వరుడు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

గురునానక్ వర్ధంతి



సిక్కుమత గురువు గురునానక్ దేవ్ 1469 ఏప్రిల్ 15న లాహోర్‌లో జన్మించారు. హిందూ, ఇస్లాం గ్రంథాలను చదివి భిన్నమైన 'సిక్కు' మతాన్ని స్థాపించారు. పదిమంది సిక్కు గురువులలో తొలివ్యక్తి. ఏకేశ్వరోపాసనను ప్రబోధించి కుల వ్యవస్థను వ్యతిరేకించిన గురువు. నానక్ తర్వాత గురు పరంపర కొనసాగింది. మతసామరస్య బోధనలు చేశారు. సత్యం, అహింస ఆయన సిద్ధాంతాలలో ముఖ్యమైనవి. పవిత్ర గ్రంథమైన గురుగ్రంథ్ సాహిబ్‌లో ఎన్నో అంశాలను ప్రస్తావించారు. మానవత్వం, జాలి, దయ, ప్రేమను ఆచరించడం వంటివి ప్రధాన వాణిగా ఉంది. 1539 సెప్టెంబరు 22న కన్నుమూశారు.

పీబీ శ్రీనివాస్ జయంతి



నుదుటన తిలకం, తలపాగా ధరించడంతో విలక్షణంగా కనిపించి సినీ నేపథ్య గాయకుడు ప్రతివాది భయంకర (పీబీ) శ్రీనివాస్ 1930 సెప్టెంబరు 22న తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో జన్మించారు. మాతృభాష తెలుగు కంటే కన్నడ, తమిళ సినిమాలలో ఎక్కువ పాటలు పాడారు. అంతే కాక మళయాళ, తుళు, కొంకణి, హిందీ భాషలలో సైతం పాటలు పాడారు. కవిగా 8 భాషలపై పట్టు కలిగినవారు. స్వరకర్తగా, హార్మోనియం కళాకారుడు, గేయ రచయిత, సాహితీవేత్త, కవిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. ఎన్నో గజల్స్ కూడా రాశారు. 12భాషల సినిమాల్లో పాటలు పాడారు. మూడు దశాబ్దాల పాటు కన్నడ సినీ రంగాన్ని ఏలారు. కన్నడ కంఠీరవుడు రాజ్‌కుమార్‌కు ఎన్నో పాటలు పాడారు. కన్నడ రాజ్యోత్సవ, కలైమామణి, నాడోజ, కలైవనర్ తదితర పురస్కారాలు పొందారు. 2013 ఏప్రిల్ 14న కన్నుమూశారు.

అశోకమిత్రన్ జయంతి



కలం పేరు అశోకమిత్రన్‌తో పేరొందిన రచయిత జగదీశ త్యాగరాజన్ 1931 సెప్టెంబరు 22న సికింద్రాబాద్‌లో జన్మించారు. తమిళ సాహిత్యంలో ఎంతో పేరొందారు. 'కనైయాజి' పత్రికకు సంపాదకులు. 200కు పైగా చిన్నకథలు, 8 నవలలు రాశారు. అత్యధిక రచనలు ఆంగ్లంతోపాటు హిందీ, మళయాళం, తెలుగులోకి అనువాదం అయ్యాయి. సాహిత్య అకాడమీ, అక్షర అవార్డు, ఎన్టీఆర్ నేషనల్ లిటరరీ అవార్డుతోపాటు పలు అవార్డులు దక్కాయి. 2017 మార్చి 23న కన్నుమూశారు.

మార్టిన్ క్రో జయంతి



మార్టిన్ డేవిడ్ క్రో 1962 సెప్టెంబరు 22న జన్మించారు. న్యూజిలాండ్ క్రికెటర్. టెస్ట్, వన్డే కెప్టెన్‌గాను, కామెంటేటర్‌గా రాణించారు. న్యూజిలాండ్ జాతీయ క్రికెట్ జట్టులో 1982 నుంచి 1995 మధ్య ఆడారు. దేశంలోనే గొప్ప బ్యాట్స్‌మెన్‌గా పేరొందారు. 1985లో విజ్డన్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్, బెస్ట్ యంగ్ బ్యాట్స్‌మెన్ ఇన్ ది వరల్డ్‌గా గుర్తింపు పొందారు. 1992లో వరల్డ్‌కప్ పోటీల్లో జట్టును సెమీఫైనల్ దాకా తీసుకెళ్లారు. వన్డేలలో 21 సెంచరీలు చేశారు. ఆటనుంచి రిటైరయ్యాక రైటర్‌గా, కామెంటేటర్‌గా వ్యవహరించారు. 2016 మార్చి 3న కన్నుమూశారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కరెమ్మ నాయక్

ఎమ్మెల్యే పరామర్శ

రాయచూరు సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దేవదుర్గ పురసభ పరిధిలోని హెచ్‌ఎన్ తాండాలో పాము కాటకు గురై ఇటీవల మృతి చెందిన శివప్ప(16) కుటుంబాన్ని ఆదివారం దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ పరామర్శించారుకుటుంబ సభ్యులతో మాట్లాడిన ఆమె కుటుంబానికి వ్యక్తిగత ఆర్థిక సహాయం అందజేసి ప్రభుత్వ పరంగా తగిన తోడ్పాటు అందేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. పాము కాటుకు గురైన తక్షణమే ఆస్పత్రికి వెళ్లాలని పాత పద్దతిలో మంతరాలు వేయడం, నీరు తాగడం వంటి వాటికి అవకాశం ఇవ్వవద్దంటు స్థానికులకు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అనంతరం అంబులెన్స్ సహాయంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి వెళ్లాలని ఇందుకు తగిన అంబులెన్స్‌లు వైద్యసేవలు అన్ని అందుబాటులో ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలని సూచించారు.

గంజాయి కేసులో వైద్యుడి అరెస్టు

పావగడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎండీఎంఎం, గంజాయి ఇతర మత్తు పదార్థాలను అమ్ముతున్న వేళ వైఎన్‌హొసకోటకు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు నాగేంద్ర గుప్తా తనయుడు దంత వైద్యుడు కళ్యాణశెట్టిని దావణగెరె సీఈఎన్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. దావణగెరెలోని ఓ ప్రైవేట్ కాలేజీలో దంత వైద్యుడిగా పనిచేస్తున్న కళ్యాణశెట్టి నైజీరియాదేశానికి చెందిన ఇద్దరు యువకులతో కలిపి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్ట్ అయిన కళ్యాణశెట్టి పావగడ, వైఎన్‌హొసకోట, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్నట్లు తేలిందని పోలీసులు తెలిపారు.

నేడు పీఎం స్వానిధిపై అవగాహన

హిందూపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద పీఎం స్వానిధిపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. పట్టణంలో చిరు, వీధి వ్యాపారులకు రూ.10వేలు నుంచి రూ.50వేలు రుణసౌకర్యం కల్పించే విషయంపై అవగాహన ఉంటుందన్నారు.

పురవీధుల్లో సైకిల్‌పై పర్యటించిన డీసీ



ఉద్యానవనంలో స్థానికుల సమస్యలు ఆలకిస్తున్న జిల్లా అధికారి



పురవీధుల్లో సైకిల్‌పై తిరుగుతున్న జిల్లా అధికారి రవి

ముళబాగిలు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోలారు జిల్లా అధికారి డాక్టర్ ఎంఆర్ రవి ముళబాగిలు పట్టణంలో ఆదివారం సిటీరౌండ్స్ నిర్వహించారు. పురవీధులలో సైకిల్‌పై సంచరించారు. పలు ఉద్యానవనాలలో స్థానికుల సమస్యలను ఆలకించారు. పట్టణంలో పురాణ ప్రసిద్ధమైన సోమేశ్వర చెరువు, ఉద్యానవనం, అంబేడ్కర్ సర్కిల్, ఎంసీ రోడ్డు, కేఈబీ సర్కిల్, ఆంజనేయస్వామి దేవాలయం, ఇందిరాక్యాంటీన్‌లను పరిశీలించారు. రోడ్ల స్థితిగతులను స్వయంగా వీక్షించారు. కొన్నిచోట్ల చెత్తకుప్పలు ఉండడాన్ని గమనించి స్వచ్ఛతపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రద్దీ ప్రాంతాలలో పబ్లిక్ టాయ్‌లెట్స్ నిర్మించాలని సూచించారు. కొన్నిచోట్ల నగరసభ పరిధిలో చికెన్, మటన్ దుకాణాల నిర్వహణ సజావుగా లేకపోవడం దుర్వాసన తలెత్తినట్లు అధికారులకు సూచించారు. తోపుడుబండ్లపై ఆహారపదార్థాలు విక్రయించే వారికి ఇబ్బంది లేకుండా నిర్దేశించిన స్థలాల్లో ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేయాలని సూచించారు. సోమేశ్వరచెరువు ఉద్యానవనానికి మరిన్ని సౌభ్యాలు కల్పించే అంశంపై సంబంధిత అధికారులతో చర్చించనున్నట్టు జిల్లా అధికారి తెలిపారు. నెహ్రూ పార్కులో కొత్తబోరుబావి తవ్వించే అంశంపై ఇప్పటికే సూచించామని, దీంతోపాటు జిమ్, పిల్లల ఆటల పరికరాలు ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు సూచించారు. కాగా ముళబాగిలు ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులకు లడ్డూ పంపిణీ అవుతోందని, అదే రీతిన కోలారమ్మ దేవాలయం, కేజీఎఫ్ తాలూకాలోని బంగారు తిరుపతి దేవస్థానంలోనూ లడ్డూ పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ప్రతి ఇంటినుంచి తడి, పొడి చెత్త సేకరణ వందశాతం కావడం లేదని, ఇందుకు ప్రజలు, నగరసభ సిబ్బంది కూడా సహకరించాలని సూచించారు. కలెక్టర్ వెంట ముళబాగిలు తహసీల్దార్ వీ గీతా, ఈఓ డాక్టర్ కే సర్వేశ్, నగరసభ కమిషనర్ వీ శ్రీధర్, కోలారు జిల్లా యోజనా డైరెక్టర్ అంబిక, జిల్లా నగరాభివృద్ధి విభాగం ఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

» హులిబెలె సహకార సంఘం అధ్యక్షుడు మంజునాథ్



హులిబెలె ప్రాథమిక కృషి గ్రామీణ సహకారసంఘం సభ్యులు

బంగారపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రుణాలు సకాలంలో చెల్లించడం ద్వారా సంఘం పురోగతికి సహకరించాలని వివిధ ఉద్దేశ్య ప్రాథమిక కృషి గ్రామీణ సహకారసంఘం అధ్యక్షుడు మంజునాథ్ విజ్ఞప్తి చేశారు. తాలూకాలోని హులిబెలె గ్రామంలో సంఘం సర్వసభ్య వార్షిక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రానున్నరోజుల్లో సహకారసంఘం నుంచి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించాలని తద్వారా సంఘం స్వావలంబన సాధ్యమని, లేకుంటే నష్టాలు తప్పవన్నారు. సహకారసంఘం చట్టాల ప్రకారం ఒక పాలనావధిలో కనీసం మూడు మహాసభలకు సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉంటుందని, సంఘంలో లావాదేవీలు కొనసాగించాలని లేకుంటే సభ్యత్వం తటస్థంగా మారుతుందన్నారు. మాజీ అధ్యక్షులు వీణా వెంకటేశ్ మాట్లాడుతూ ప్రాథమిక కృషి గ్రామీణ సహకారసంఘాన్ని తాలూకాలో ప్రథమస్థానంలో నిలవాలంటే సభ్యుల సహకారం ఉండాలని, రుణాలు సకాలంలో తిరిగి చెల్లించాలన్నారు. డీసీసీ బ్యాంకు రెండేళ్లుగా రుణాలు ఇవ్వడం లేదని, ఇటీవల ఎన్నికలు జరిగాయన్నారు. కొన్ని కారణాలతో అంశం కోర్టులో ఉండడంతో రుణాలు సాధ్యం కావడం లేదన్నారు. మరో రెండు నెలల్లో సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉందని, అనంతరం రైతులకు మళ్లీ రుణాలు ఇచ్చేందుకు వీలవుతుందన్నారు. సమావేశంలో పీఎల్‌డీ బ్యాంకు మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత డైరెక్టర్ హెచ్‌కే నారాయణస్వామి, ఉపాధ్యక్షులు రాజప్ప, డైరెక్టర్‌లు అశ్వత్థప్ప, జనార్ధన్, రామకృష్ణప్ప, రామప్ప, వెంకటేశప్ప, అప్పలప్ప, మంజునాథ్, జయంతి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించండి : ఎమ్మెల్యే



క్రీడాకారులతో ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి తదితరులు

బొమ్మనహళ్ళి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ క్రీడలను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు. కోడిచిక్కనహళ్ళిలోని కబడ్డీ క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజు నేపథ్యంలో నవచేతన కబడ్డీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పోటీలు జరిగాయి. పిల్లలను చదువులకే పరిమితం చేయకుండా వారికి ఆసక్తి కల్గిన క్రీడా పోటీలలో పాల్గొనేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరింతగా ప్రోత్సహించాలన్నారు. వికసిత భారత్‌లో భాగంగా ఈ దిశలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగిస్తున్నాయన్నారు. పాఠశాల, కళాశాలల్లో క్రీడలకు తగినంతగా క్రీడామైదానం ఏర్పాటు చేయాలన్నారు. పల్లెలకు పరిమితమైన కబడ్డీ పోటీలు క్రమేపీ పట్టణ, నగరాలకు చేరుకుని జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో ఒకటిగా కొనసాగుతోందన్నారు. పోటీలలో 25 జట్లు తలపడ్డాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.20, 15, 10వేలు నగదు బహుమతి, ట్రోఫీలను ప్రదానం చేశారు. బొమ్మనహళ్ళి నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు శివాజి, బీజేపీ సీనియర్ నాయకులు మంజునాథ్, నవచేతన సంస్థ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ మ్యాచ్‌లో ఓ సన్నివేశం

పితృపక్షం వేళ ప్రత్యేక పూజలు



కాశీ విశ్వనాథ ఆలయం వద్ద భక్తుల క్యూ



చేళూరులో సామూహిక తర్పణంలో పాల్గొన్న ప్రజలు

బెంగళూరు, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): మహాలయ అమావాస్యను పురస్కరించుకుని పూర్వీకులకు పిండప్రదానం చేసే ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా జరిగింది. పూర్వీకులను స్మరించుకుని వారి పేరిట తర్పణం వదిలే సంప్రదాయం కొనసాగింది. మండ్య జిల్లా శ్రీరంగపట్టణలో కావేరి నది ఒడ్డున పిండ ప్రదాన ప్రకియ నిర్వహించారు. ఇంటింటా పూర్వీకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, కొత్తబట్టలు, తినుబండారాలు ఉంచి పూజలు జరిపారు. బెంగళూరు కాటన్‌పేటలోని కాశీవిశ్వనాథ ఆలయంలో ప్రత్యేకపూజల్లో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

తాలూకాలో సామూహిక తర్పణం

చేళూరు(ఆంధ్రజ్యోతి): మహాలయ అమావాస్య నేపథ్యంలో తాలూకా కేంద్రమైన చేళూరులో బ్రాహ్మణుల సముదాయభవనంలో ఆదివారం సామూహిక తర్పణం నిర్వహించారు. పలువురు పాల్గొని తమ పూర్వీకులకు తర్పణం, పిండప్రదానం చేశారు. బ్రాహ్మణ సంఘం తాలూకా అధ్యక్షుడు నాగభూషణం, కార్యవర్గ సభ్యులు రాఘవేంద్ర, మంజులు సహకారం అందించారు. చుట్టుపక్కల గ్రామాలనుంచి బ్రాహ్మణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



డివైడర్లు, బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ భూమిపూజ చేశారు. హౌసింగ్‌బోర్డులో రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టే బీటీ రోడ్డు, డివైడర్ల నిర్మాణానికి నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పాలకు లు నగరంలోని పరిస్థితులను అధ్వాన్నంగా మా ర్చారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడాదిలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ముఖ్యంగా డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఏఎంసీ ఎస్ఈ రాజశేఖర్, ఇంజనీర్లు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే..

అనంతపురంక్రైం: నూతన కలెక్టర్ ఆనంద్‌ను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కలిశా రు. కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగాకలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. న గర అభివృద్ధికి తోడ్పాటనందించాలని కోరారు.

పంచాయతీ కార్యాలయాన్ని

పరిశీలించిన జడ్పీ సీఈఓ



కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సీఈఓ ఈశ్వర్ కుమార్

రాయచూరు సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ ముఖ్య కార్యానిర్వహణాధికారి (జడ్పీ సీఈఓ) ఈశ్వర్ కుమార్ కాందూ శనివారం సాయంత్రం రాయచూరు తాలూకాలోని మన్సలాపూర్ గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత గ్రామ పంచాయతీ నూతన కార్యాలయ భవనాన్ని అసాంతం పరిశీలించిన జడ్పీ సీఈఓ అక్కడ ఉద్యోగుల హాజరు పట్టిని వివిధ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి ఉన్న రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. అనంతరం ఉపాధి హామి పనుల వివరాలను తాగునీటి పథకం పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడిన జడ్పీ సీఈఓ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

కులగణన సమీక్షలో పాల్గొనండి

» వహ్నికుల క్షత్రియ సంఘం పిలుపు



మీడియా సమావేశంలో వహ్నికుల సంఘం పదాధికారులు

దొమ్మసంద్ర, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బీసీ కమిషన్ ఆధ్వర్యంలో జరిగే కులగణన సమీక్షలో పాల్గొనాలని కర్ణాటక రాష్ట్ర వహ్నికుల క్షత్రియసంఘం పిలుపునిచ్చింది. సంఘం ఉపాధ్యక్షుడు, మాజీ సైనికుడు సీ వేణు చిన్నప్ప ఆధ్వర్యంలో దొమ్మసంద్ర గ్రామం ముత్యాలమ్మ దేవాలయ ఆవరణలో సంఘం పదాధికారులు ఆదివారం మీడియాతో మాట్లాడారు. సామాజిక, విద్య, ఆర్థిక సర్వేలో వహ్నికుల క్షత్రియ సామాజికవర్గం వారు కోడ్ 1508 ప్రకారం కాలం సంఖ్య 9లో వన్నికుల/వహ్నికులగా నమోదు చేయాలని పిలుపునిచ్చారు. వహ్నికుల సామాజికవర్గీయుల నికరమైన సంఖ్య తెలియాలంటే ప్రతి ఒక్కరూ కులగణనలో భాగస్వామ్యులు కావాలన్నారు. ప్రభుత్వ రిజర్వేషన్లు పొందేందుకు సాధ్యమవుతుందన్నారు. ఉపకులాలతో కలిపి సుమారు 50లక్షలమంది జనాభా ఉన్నట్లు అంచనాగా ఉందన్నారు. ప్రస్తుత సర్వేలో వహ్నికులగా నమోదు చేయడం ద్వారా సామాజిక వర్గీయులు అంతా ఒక వేదికపైకి రానున్నారన్నారు. సమావేశంలో ముత్యాలమ్మ ఆలయ సమితి అధ్యక్షుడు శ్రీనివాసన్, ఉపాధ్యక్షుడు జయదేవ్, కార్యదర్శి డీసీ చంద్రహాస్, మణి, రామచంద్ర, శరవణ, బలరామప్ప, కోనేరప్ప, సంఘం పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

గంగ మతస్థులు విద్యావంతులు కావాలి



విద్యార్థులను సత్కరిస్తున్న గంగమత ఉద్యోగులు

సిరుగుప్ప, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గంగామతస్థులు విద్య ప్రగతి సాధించాలనే ఉద్దేశ్యంతో ప్రతిభా పురస్కార కార్యక్రమాన్ని చేపట్టినట్లు గంగామతస్థుల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మల్లికార్జున అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం సిరుగుప్ప పట్టణం ఎన్జీవో భవనంలో గంగామతస్థుల ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎల్‌సీ, పీయుసీ విద్యార్థులకు ప్రతిభా పురస్కార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన పదవ తరగతి విద్యార్థిని శ్రావణి, సుచిత్ర, మధుశ్రీ, గురురాజలకు సన్మానించారు. ఈ కార్యక్రమం సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ రెండవ సంవత్సరం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. గంగామతస్థులు విద్య ఉద్యోగాలలో దూసుకెళ్లాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కార్యదర్శి రాఘవేంద్ర, కోశాధికారి షణ్ముఖప్ప, దొడ్డనగౌడ, గోవిందప్ప, వెంకటేష, కాళింగప్ప, బసవరాజు, హరీష్, దొడ్డ బసప్ప, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాకారులను గౌరవించాలి

● కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సోమశేఖర్



కళాకారులతో ఎస్పీ పుట్టమాదయ్య తదితరులు

రాయచూరు సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కళాకారులను గుర్తించి గౌరవించి ప్రోత్సహించడం హర్షదాయకమని ఆ దిశగా తనవంతు బాధ్యతను నెరవేరుస్తున్న బెళకు సంస్థ కార్యక్రమాలు ఇతరులకు మార్గదర్శకమని గడి ప్రదేశ అభివృద్ధి మండలి మాజీ అధ్యక్షుడు డాక్టర్ సోమశేఖర్ అన్నారు. బెళకు సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని రంగమందిరంలో ఏర్పాటు చేసిన కళాకారుల అభినందన సన్మాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాగడిన డాక్టర్ సోమశేఖర్, భారతీయ సంస్కృతిలో సాహితీవేత్తలకు కలాకారులకు ప్రత్యేక స్థానం ఉందని వారిని గుర్తించి గౌరవించడం మన బాధ్యత అన్నారు. తద్వార సంస్కృతిని పరిరక్షించుకోవాలన్నారు. బెళకు సంస్థ తన పేరును సార్థకం చేసుకునే రీతిలో సమాజానికి నలుగు దిక్కుల వెలుగును ప్రసాధించడం అభినందనీయమన్నారు. వెలుగు అన్నది కేవలం ఒకే అర్థం కాదని అభివృద్ధి, సంక్షేమం, విజ్ఞానం, సౌహార్దం, తదితర అంశాలన్ని ఇందులో ఇమిడి ఉన్నాయన్నారు. జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య మాట్లాడుతూ కళాకారులను గౌరవించడం సామాజిక సేవతో సమానమన్నారు. జానపద కళాకారులు మన సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకలని వారిని ప్రోత్సహించాల్సిన అవసరం అందరి పై ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు, కళాకారులను సంస్థ తరపున గౌరవించి సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

11మందిపై కేసు నమోదు

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): నంది విగ్రహం చోరీ సంఘటన నిగ్గు తేల్చాలంటూ మండలకేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను ముట్టడించిన ముష్టికోవెల గ్రామానికి చెందిన పలువురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. ముష్టికోవెల గ్రామస్థులు గత శనివారం పెద్దఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. అమల్లో ఉన్న 30 పోలీస్ యాక్టును ఆ గ్రామస్థులు ఉల్లంఘించారని, ర్యాలీతో నినాదాలు చేసుకుంటూ గుంపుగా పోలీసు స్టేషన్ ముట్టడించి తమ విధులకు అటంకం కల్గించారని, ఇందుకు సంబంధించి వారిపై 11మందిపై కేసు నమోదు చేసి 41ఏ నోటీసు జారీ చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు. అదే విధంగా రెండు వాహనాలను సీజ్ చేశామన్నారు.